


www.manavaarthamirror.com

# మన వార్త మిర్రర్

మంగళవారం

11 ఆగస్టు 2026

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## ఏపీ, తెలంగాణలో భారీ వర్షాలు.. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ.. వాతావరణశాఖ హెచ్చరిక ఇదే..



**ఏపీ, తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ బిగ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే రెండ్రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. పలు జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ ఇచ్చింది. పిడుగుపాటు హెచ్చరికలు కూడా జారీ చేసింది. ఏపీ, తెలంగాణకు వాతావరణశాఖ భారీ రెయిన్ అలర్ట్ జారీ చేసింది.**

నేడు, రేపు పలు జిల్లాల్లో వర్షాలు పడతాయని హెచ్చరించింది.

దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. బుధవారం నాటికి ఇది అల్పపీడనంగా మారే అవకాశముందని, దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురవనున్నట్లు స్పష్టం చేసింది. ఏపీ విషయానికొస్తే.. అనకాపల్లి, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో భారీ వానలు పడతాయని హెచ్చరించింది. ఈ మేరకు మంగళవారం, బుధవారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇక పలుచోట్ల పిడుగులు పడే అవకాశముందని, ఉరుములు, మెరుపుల సమయంలో సురక్షిత ప్రదేశాల్లో తలదాచుకోవాలని సూచించింది.

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథి గృహం వద్ద కృష్ణా నది ఒడ్డున నిర్వహించిన ఈ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో క్రతువులు నిర్వహించారు. కృష్ణమ్మకు సీఎం పూర్ణాహుతి సమర్పించారు.



## వర్షాల కోసం వరుణ యాగం..

- సతీసమేతంగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణలో వర్షాల కోసం ప్రభుత్వం మహా వరుణ యాగం
- నాగార్జున సాగర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతుల పూజలు
- ఎల్ నినో ప్రభావం, తగ్గిన జలమట్టాల నేపథ్యంలో ప్రత్యేక క్రతువు
- యాదగిరిగుట్ట పండితుల ఆధ్వర్యంలో 11 హోమగుండాలతో యాగం

నల్లగొండ: 'రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి. కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలి. ప్రాజెక్టులు, చెరువులు నిండాలి..'అని ప్రార్థించారు. సోమవారం ఉదయం 4 గంటలకు బ్రహ్మ ముహూర్తంలో యాగాన్ని ప్రారంభించారు.

- మిగతా 2వ పేజీలో

## నా రాజకీయ జీవితంలో ఇంత దౌర్భాగ్యపు పార్టీని చూడలేదు

- కైకలూరులో భూ హక్కు పత్రాలు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- భూ కబ్జాదారుల పెత్తనానికి చరమగీతం పాడతామని హామీ
- వైసీపీ ఒక గొడ్డలి పార్టీ అని, రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తోందని తీవ్ర విమర్శ
- గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను ఉపేక్షించేది లేదని, పోలీసులపై దాడులు సహించబోమని హెచ్చరిక
- ఆక్వా రైతులకు రూ.1.50కే విద్యుత్ అందిస్తామని, 10 ఎకరాల నిబంధన రద్దు చేశామని ప్రకటన



రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అరాచకాలకు, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు శాశ్వతంగా చరమగీతం పాడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో తాము పనిచేస్తుంటే, ప్రతిపక్ష వైసీపీ మాత్రం శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. సోమవారం ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో నిర్వహించిన భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు.

### భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రతి నెల 9వ తేదీన భూ సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించి, నేరుగా ప్రజల వద్దకే వచ్చి పట్టాలు అందిస్తున్నామని చంద్రబాబు తెలిపారు.

- మిగతా 2వ పేజీలో

## పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం..

- యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన
- పన్నుల సవరణ బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం
- యూపీఐ లావాదేవీలపై వినియోగదారులకు ఛార్జీలు లేవని నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ
- మర్చంట్ డిస్కౌంట్ రేట్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్న కేంద్రం




## ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు...

- ఈసారి కూడా వైసీపీ గైర్హాజరు?
- ఆగస్ట్ 17 నుంచి ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాలు
- ప్రతిపక్ష హోదా ఇవ్వనందున అసెంబ్లీకి దూరంగా ఉండనున్న వైసీపీ
- శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరుకానున్న విపక్షం



## ఝార్ఖండ్‌లో టెన్షన్..

- ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తం
- బారికేడ్లు దాటి అసెంబ్లీ వైపు విద్యార్థుల మార్చ్
- అడ్డుకునేందుకు వాటర్ కేనన్లు ప్రయోగించిన పోలీసులు
- పేపర్ లీక్‌లపై సీబీఐ దర్యాప్తు కోరుతున్న విద్యార్థులు
- 13 పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్

రాంచి, ఆగస్టు 10: జార్ఖండ్ అసెంబ్లీ ప్రాంగణం వైపు దూసుకెళ్లిన నిరసనకారులపై పోలీసులు లాఠీలు ఝులిపించారు. వాటర్ కెనన్లు, బాష్పవాయువును ప్రయోగించారు. పోలీసు లాఠీచార్జ్‌లో పలువురు విద్యార్థుల తలలు పగిలి తీవ్రంగా గాయపడ్డారు. బారికేడ్లను ఛేదించుకుని అసెంబ్లీ వద్దకు చేరుకోవడానికి భారీ సంఖ్యలో విద్యార్థులు తరలిరావడంతో పరిస్థితి

## సురక్షితంగా తీసుకొస్తాం..

- ఉద్యోగాల పేరుతో థాయ్‌లాండ్‌కు వెళ్లి మోసపోయిన తెలుగు యువత
- సైబర్ నేరగాళ్ల చెర నుంచి తప్పించుకుని సరిహద్దుల్లో చిక్కుకున్న బాధితులు
- తమను రక్షించాలంటూ సోషల్ మీడియా ద్వారా అభ్యర్థన
- స్పందించిన మంత్రి నారా లోకేశ్, సురక్షితంగా రప్పిస్తామని హామీ
- విదేశాంగ శాఖ అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడి



## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ

### మంత్రి పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్ రెడ్డి

- హన్మకొండ జిల్లా కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో ఉద్రిక్తత
- మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్‌తో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వాగ్వాదం
- గత ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో వేదికపైనే అభ్యంతరం తెలిపిన ఎమ్మెల్యే
- ప్రభుత్వ వేదికపై రాజకీయాలు వద్దంటూ మంత్రులకు హితవు
- ఇరువర్గాల నినాదాలతో జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దిన పోలీసులు



# ఆదివాసీ యోధుల్లారా పాట ఆవిష్కరణ

### ......ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం ఐక్యంగా పోరాడాలి





సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఆగస్టు 10: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో 'ఆదివాసీ యోధుల్లారా' పాటను ఘనంగా ఆవిష్కరించారు. డీబీఎస్ఏ, భీమ్ డ్రమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నలిగంటి శరత్ చమార్ రచించి, గానం చేసిన ఈ పాటను కార్యక్రమంలో విడుదల చేశారు. భరత్ మేకల సంగీతం అందించగా.. శ్రీకాంత్ డీవీపీ, ఎడిటింగ్, వర్షిత్ బమర్ పోస్టర్ డిజైన్ బాధ్యతలు నిర్వర్తించారు.ఈ సందర్భంగా డాక్టర్ నలిగంటి శరత్ చమార్ మాట్లాడుతూ.. ఆదివాసీ సమాజం శతాబ్దాలుగా ప్రకృతితో మమేకమై జీవిస్తోందన్నారు. భూమి, అడవి, నీరు, హక్కులు, అస్తిత్వం కోసం ఆదివాసీ యోధులు చేసిన పోరాటాలు, త్యాగాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. 'ఆదివాసీ యోధుల్లారా' పాట ద్వారా ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, ఆత్మగౌరవం, హక్కుల కోసం సాగిన పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశామని తెలిపారు.ఆదివాసీల హక్కులను కాపాడటం అంటే ప్రకృతిని కాపాడటమేనని, అడవులు, జల వనరులు, భూములు, ప్రకృతి సంపదతో పాటు రాజ్యాంగ హక్కులను కూడా పరిరక్షించాలని పిలుపునిచ్చారు. యువత ఆదివాసీ చరిత్రను అధ్యయనం చేయాలని, కవులు, రచయితలు, కళాకారులు తమ రచనలు, పాటలు, కళారూపాల ద్వారా ఆదివాసీ జీవన విధానం, పోరాటాలను సమాజంలోకి తీసుకెళ్లాలని కోరారు. ఓయూ విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ సంస్కృతి, చరిత్ర, హక్కుల పరిరక్షణకు విద్యార్థులు, మేధావులు, కవులు, రచయితలు, సామాజిక ఉద్యమకారులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆప్కా నాగేశ్వరరావు, సూర్యకిరణ్, డీబీఎస్ఏ రాష్ట్ర కోఆర్డినేటర్ జంగిలి దర్శన్, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆర్.ఎల్. మూర్తి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కొమ్ము శేఖర్ మాదిగ, టీఎస్పీ జాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వాలిగొండ నరసింహ, ఏఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్, డీబీఎస్ఏ రాష్ట్ర అధికార ప్రతినిధి కాసర్ల మధుసూదన్, డీబీఎస్ఏ ఆల్ యూనివర్సిటీస్ ఇన్‌చార్జి ప్రశాంత్ చిన్నా, బిక్కు మురళి, సంతోష్ ఇస్రం, అన్సర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. ఆదివాసీ విద్యార్థులు, ఓయూ పరిశోధక విద్యార్థులు, విద్యార్థిసంఘాల నాయకులు, కవులు, రచయితలు, సామాజిక ఉద్యమకారులు హాజరయ్యారు.

# కొండమల్లేపల్లిలో 'నేనే రాజు.. నా మంత్రి వేరే!'

### పంచాయతీ పాలనపై పెరుగుతున్న ఆరోపణలు.. వార్డు సభ్యుల అసంతృప్తి
### మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలపై వివాదం..
### పంచాయతీ ఆదాయ--వ్యయాలపై పారదర్శకత ప్రశ్నార్థకం!

కొండమల్లేపల్లి, ఆగస్టు 10 వార్త మిర్రర్::::

నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి మేజర్ గ్రామపంచాయతీలో పాలన వ్యవహారం రోజురోజుకు చర్చనీయాంశంగా మారుతోంది. "నేనే రాజు" అన్న ధోరణిలో సర్పంచ్.. "నేనే మంత్రి" అన్న పోకడలో పంచాయతీ కార్యదర్శి వ్యవహరిస్తున్నారంటూ కొందరు వార్డు సభ్యులు, గ్రామస్థులు విమర్శలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ముగ్గురు సేనాధిపతుల అసంతృప్తి?**

పంచాయతీ పాలనలో సర్పంచ్ నిర్ణయాలకు వ్యతిరేకంగా ముగ్గురు వార్డు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నప్పటికీ, పాలనా తీరులో మార్పు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల తరపున పనిచేయాల్సిన వార్డు సభ్యులు, సర్పంచ్ ఆదేశాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**వార్డు సభ్యులు సేనాధిపతులైతే.. వారికి నిర్ణయాధికారం ఎంత?**

పంచాయతీ పాలనలో సర్పంచ్, కార్యదర్శి పాత్రల మధ్య సమన్వయం ఎలా ఉంది? అన్నది అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

**'మంత్రి'పై కూడా ఆరోపణలే!**

మరోవైపు పంచాయతీ కార్యదర్శిపై కూడా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామపంచాయతీకి ఉన్న ఆదాయ వనరులను సద్వినియోగం చేస్తూ ఆదాయ మార్గాలను పెంచుతున్నారా? లేక వసూళ్లు, ఆదాయం, ఖర్చులకు సంబంధించిన పూర్తి లెక్కలు ప్రజలకు అందుబాటులో లేకుండా ఉన్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పంచాయతీకి వస్తున్న ప్రతి రూపాయి ఆదాయానికి రసీదులు, డిమాండ్--కలెక్షన్ రిజిస్టర్లు, బ్యాంకు జమలు, ఖర్చుల బిల్లులు, వౌచర్లు సక్రమంగా ఉన్నాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు కీలకంగా మారాయి.

**"లెక్కలు అడిగితే లెక్కలు చూపిస్తారా?"**

"ప్రజా నిధుల వినియోగంపై పూర్తి పారదర్శకత ఉందా?"




అన్న ప్రశ్నలకు అధికారిక సమాధానం రావాల్సి ఉంది.

ఆరుగాలం శ్రమించే మల్టీపర్పస్ వర్కర్లకు న్యాయం ఎక్కడ?

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఎండా--వానా లెక్కచేయకుండా పనిచేసే మల్టీపర్పస్ వర్కర్ల పరిస్థితి కూడా ప్రశ్నార్థకంగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి.తమకు చెల్లించాల్సిన పారితోషికాలు, జీతభత్యాలు సకాలంలో అందడం లేదని కొందరు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.ఒకవైపు గ్రామ పరిశుభ్రత కోసం వారి శ్రమను వినియోగించుకుంటూ.. మరోవైపు వారి పారితోషికాల విషయంలో జాప్యం ఎందుకు? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**సర్పంచ్ ఆదేశాలే శాసనమా?**

మల్టీపర్పస్ వర్కర్లు ఆయా వార్డుల్లో పనిచేసేటప్పుడు సంబంధిత వార్డు సభ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, సర్పంచ్ ఆదేశాలు లేకుండా పనిచేయడానికి సిబ్బంది ముందుకు రావడం లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.ఇది నిజమైతే గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల వ్యవస్థకు అర్థమేంటి?వార్డు సభ్యుల పాత్ర కేవలం పేరుకే పరిమితమవుతోందా?అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**గ్రామానికి ఆదాయం ఉంది.. మరి లెక్కలు ఎక్కడ?**

కొండమల్లేపల్లి మేజర్ గ్రామపంచాయతీకి వివిధ పన్నులు, ఫీజులు, అద్దెలు, ఇతర వనరుల ద్వారా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ఆదాయం--వ్యయాల పూర్తి వివరాలు ప్రజలకు స్పష్టంగా అందుతున్నాయా? అన్నది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.వసూలైన మొత్తం ఎంత?బ్యాంకులో జమ చేసిన మొత్తం ఎంత?ఖర్చు చేసిన మొత్తం ఎంత?మిగిలిన నిధులు ఎంత?ఏ పనులకు ఎంత ఖర్చు చేశారు?ఈ ప్రశ్నలకు పంచాయతీ రికార్డులే సమాధానం చెప్పాల్సి ఉంది.

**'నేనే రాజు.. నా మంత్రి వేరే.. నా సేనాధిపతులు వేరే!'**



కొండమల్లేపల్లి పంచాయతీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను చూస్తుంటే "నేనే రాజు.. నా మంత్రి వేరే.. నా సేనాధిపతులు వేరే.. ప్రజల పరిస్థితి ఏమిటి?" అనే చర్చ గ్రామంలో జరుగుతోంది.అయితే ఇవన్నీ ఆరోపణలు మాత్రమేనని, వాటి వాస్తవాలను అధికారిక రికార్డుల పరిశీలన ద్వారా నిర్ధారించాల్సి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**సమగ్ర విచారణకు గ్రామస్థుల డిమాండ్**

పంచాయతీకి వచ్చిన ఆదాయం, ఖర్చులు, బ్యాంకు లావాదేవీలు, పన్నులు--ఫీజుల వసూళ్లు, పంచాయతీ ఆస్తుల వినియోగం, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు, గ్రామసభ తీర్మానాలు, అభివృద్ధి పనుల బిల్లులు తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా రికార్డుల పరిశీలన చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**లెక్కలు సక్రమంగా ఉంటే చూపించడానికి భయమెందుకు?**

ఆరోపణలు అవాస్తవమైతే రికార్డులతో సమాధానం ఎందుకు ఇవ్వకూడదు?కొండమల్లేపల్లి పంచాయతీలో 'రాజు--మంత్రి--సేనాధిపతుల' పాలన నడుస్తుందా? లేక ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామపంచాయతీ పరిపాలన సాగుతోందా?అన్నది అధికారుల విచారణతో తేలాల్సి ఉంది.




# తక్షణమే అల్మాస్ గూడ, గుర్రం గూడ ప్రధాన రహదారికి మరమ్మత్తు పనులు

### రోడ్డు దుస్థితిని మున్సిపల్ ఏఈ దృష్టికి తీసుకువెళ్లిన కాంగ్రెస్ సీనియర్ నేత నవారు మల్లారెడ్డి





బాలాపూర్, మన వార్త మిర్రర్

అల్మాస్ గూడ నుండి గుర్రం గూడ కి వెళ్ళే ప్రధాన రహదారి అభివృద్ధి కోసం జిహెచ్ఎంసి నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి తెలిపారు.ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తి అయినప్పటికీ, రోడ్ పనులు ప్రారంభం కావడానికి మరి కొంత సమయం పట్టే అవకాశం ఉందని అన్నారు. అయితే ఈ రోడ్డు మీద చాలా వరకు గుంతలు పడ్డాయని, దీనతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని నవారు మల్లారెడ్డి తెలిపారు. వెంటనే రోడ్డుపై తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను కోరడం జరిగిందన్నారు. గుంతలను పూడ్చడానికి వెట్ మిక్స్ వేసి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించాలని తాము కోరడం జరిగిందన్నారు. అయితే మున్సిపల్ అధికారులునిన్న ఏదో ఎర్ర మట్టి తీసుకువచ్చి రోడ్ మీద పోయటం ద్వారా, రోడ్డంతా బురదమయం అయ్యిందని వివిధ కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం అల్మాస్ గూడ నుండి గుర్రం గూడ కి వెళ్లే రోడ్డు పరిస్థితి కాలనీ వాసుల తో కలిసి పరిశీలించినట్టు తెలిపారు. సమస్య తీవ్రతను స్థానిక ఏ ఈ హరీష్ కు ఫోన్లో వివరించి వెంటనే వెట్ మిక్స్ తో గుంతలు పూడ్చి రోడ్డు ని బాగు చేయాలని డిమాండ్ చేయటం జరిగిందన్నారు.దానికి స్పందించిన ఏఈ గ్రావెల్ తో ఫిల్ చేసి కాంట్రాక్టర్ పొరపాటు చేశారని, ఈ రోజు కానీ రేపటి లోగా తప్పకుండా వెట్ మిక్స్ వేయించి రోడ్ మరమ్మత్తులు చేయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో లక్ష్మి నర్సింహా రెడ్డి,మరియు ప్రసాద్, వెంకటేష్ గౌడ్,పి ఎల్ ఎన్ రెడ్డి,రవీందర్ రెడ్డి,వెంకటేష్,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# క్విట్ ఇండియా ఉద్యమ ప్రేరణతో లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

### పల్లా దేవేందర్ రెడ్డి ఏఐటీయూసీ కార్యదర్శి పిలుపు




దేవరకొండ ఆగస్టు 10 వార్త మిర్రర్:క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తి తో లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా ఉద్యమించాలనీ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి పిలుపు ఇచ్చారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు నేడు దేవరకొండలో నిరసన కార్యక్రమం చేయటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించుకుంటే 13 సంవత్సరాల క్రితం అధికారానికి వచ్చిన బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకు 47 కోట్ల కార్మికులకు నష్టం జరిగే విధంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లని తెచ్చారని అన్నారు.దేశంలో 90శాతం కార్మికవర్గానికి సామాజిక భద్రత లేకపోవటమే కాక, వారికి కనీస జీవన ప్రమాణాలను కూడా దూరం చేస్తూ సామాజిక భద్రత ప్రయోజనాలను రద్దు చేశారు . క్విట్ ఇండియా ప్రేరణతో కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని క్విట్ బిజెపి నినాదంతో పోరాడాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం తన మొండివైఖరి తో కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలలో భాగంగా కార్మిక చట్టాలను, రైతు చట్టాలను రద్దు చేయకుండా, రైతుల, కార్మిక హక్కులను కాలరాస్తుంది. కార్మికులు యూనియన్‌గా ఏర్పడటం, 8 గంటల పనిదినం, పని ప్రదేశంలో సామాజిక భద్రత, సమ్మె చేసే హక్కు, బేరసారాలడే హక్కులను బిజెపి ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా అనిచివేస్తుందివిద్యుత్ సవరణ బిల్లు 2025ను వెనక్కు తీసుకోవాలని విద్యుత్ ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష ధోరణితో నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నదని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం విబిజి రామ్ జీ చట్టాన్ని తెచ్చి గ్రామాలలో పనిచేస్తున్న వారికి చెల్లించే కూలీ రేట్లను, పని దినాలను పెంచి అమలు చేయాలని డిమాండ్ చేసారు. కొత్త పెన్షన్ చట్టాన్ని రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక, దేశవ్యతిరేక విధానాలతో కార్పొరేట్ శక్తులకు, ప్రభుత్వాలకు అనుకూలంగా వ్యవహరించే విధానాన్ని తీవ్రంగా ఖండించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లా రంగా రెడ్డి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి అలమోని మల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మొగుళ్ళ వెంగలయ్య,మండల కార్యదర్శి కిన్నెర బారీములు, చంద్రయ్య, మహేష్,సైదులు దేవీలాల్, మల్లయ్య, పాల్గొన్నారు.




# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్--మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి.

### ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్

కొండమల్లేపల్లి ఆగస్టు 10 వార్త మిర్రర్:::::

నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్పొరేట్ పెట్టుబడిదారులు, మతోన్మాద శక్తుల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలుకు ఫైనల్ రూల్స్‌ను నోటిఫై చేయడం, విద్యుత్ సవరణ బిల్లు--2025, విత్తన చట్టానికి సవరణలు వంటి చర్యలకు పూనుకోవడం ద్వారా పెట్టుబడిదారులకు అనుకూలంగా విధానాలను తీసుకొస్తోందని విమర్శించారు.కార్మికుల శ్రమను మరింతగా దోచుకునేందుకు పని దినాలను పెంచుతూ, రోజువారీ పని సమయాన్ని 8 గంటల నుంచి 12 గంటల వరకు పెంచుకునే విధంగా యజమాన్యాలకు స్వేచ్ఛ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మికులు దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న 8 గంటల పని, సమ్మె హక్కు, కార్మిక సంఘాల హక్కులు, ఉద్యోగ భద్రత వంటి హక్కులను లేబర్ కోడ్స్ ద్వారా కాలరాస్తున్నారని అన్నారు.కార్మిక సంఘాల గుర్తింపు, రిజిస్ట్రేషన్‌పై కఠిన ఆంక్షలు విధించడం ద్వారా కార్మికుల సంఘటిత పోరాటాలను అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్స్ అమలైతే తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కార్మికవర్గం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని, పీఎఫ్, ఈఎస్ఐ, వెల్ఫేర్ బోర్డులపై కోతలు, ఆంక్షలు విధిస్తోందని అన్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ, వీఏఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆరోగ్యశాఖలోని వివిధ స్కీమ్‌లలో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో ప్రజలు ఉపాధి హామీ పనులపై ఆధారపడుతున్నారని, అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కఠిన నిర్ణయాల వల్ల ఉపాధి హామీ పథకం నీరుగారిపోతోందని అన్నారు. ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి, గ్రామీణ పేదలకు సంవత్సరానికి కనీసం 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు.రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, విద్యాహక్కు సాధన -- ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణ -- విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యను అందరికీ అందుబాటులో ఉండే హక్కుగా కాకుండా వ్యాపారంగా మార్చే విధానాలను తక్షణమే నిలిపివేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థలకు తగిన నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.కార్పొరేట్ పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే విధానాలను విడనాడి, రైతు, కార్మిక, వ్యవసాయ కూలీల హక్కులను కాపాడే విధానాలను పాలకులు అవలంబించాలని కోరారు. ప్రజా వ్యతిరేక, కార్మిక--రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఐక్యంగా పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని ఖమ్మంపాటి శంకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, సిపిఎం పార్టీ నాయకులు రమావత్ లక్ష్మణ్ నాయక్, రమావత్ రాము నాయక్, కృష్ణ, షకీరా, బాలు, అశోక్ , కళ్యాణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# నాచారం ఓయూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఆగస్టు 10: బదిలీపై వెళ్తున్న ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్‌ను, ఓయూ ఏసీబీ జగన్ తో కలిసి నాచారం ఓయూ ప్రెస్‌క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దాసు గణేష్, గౌరవ సలహాదారు నరసింహరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జస్ట్ డి రాజు, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు విశ్వం గౌడ్, ఫణింద్రచారి తదితరులు మహేష్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఓయూ పరిధిలో విధులు నిర్వహించిన సమయంలో ఆయన అందించిన సేవలను వారు కొనియాడారు. బదిలీ అనంతరం కూడా ప్రజలకు, పోలీసు శాఖకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ ఫిరోజ్, సభ్యులు తిరుమల్ రెడ్డి, హరీష్,జీవన్ రెడ్డి, జాఫర్, విజయ్, వెంకట్, జీవన్, రవి, శ్రవణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ పడాల తిరుపతికి ఘనంగా సన్మానం

వార్త మిర్రర్ రాయికల్ ఆగస్టు 10

శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ఎస్ ఆర్ ఆర్ కరీంనగర్ లో తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం (టి.జి. సి.జి.టి.ఏ) ఆధ్వర్యంలో డాక్టర్ పడాల తిరుపతికి ఘనంగా సన్మానం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో పీజీ ఎంట్రెన్స్ అడ్మిషన్స్ కోసం కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన పరీక్షా ఫలితాలు ఇటీవలే విడుదలయ్యాయి. ఈ పీజీ ఎంట్రెన్స్ పరీక్షా ఫలితాలలో వృక్ష శాస్త్ర విభాగంలో ఉచిత ఆన్లైన్ కోచింగ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంఘం బ్యానర్ పై డాక్టర్ పడాల తిరుపతి కన్వీనర్ గా వివిధ కళాశాలలు, అధ్యాపకులు కలిసి 65 రోజుల పాటు ఉచితంగా, నిర్విరామంగా ఆన్లైన్ కోచింగ్ నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో (టాప్ టెన్)మొదటి పది ర్యాంకులలో వరుసగా మొదటి ర్యాంకు, రెండవ ర్యాంకు, మూడవ ర్యాంకు, 5వ ర్యాంకు, పదవ ర్యాంకు లతో పాటుగా మరో 32 మంది విద్యార్థులు అత్యున్నత ర్యాంకులు రాష్ట్రస్థాయిలో సాధించారు. ఈ సందర్భంగా ఆన్లైన్ కోచింగ్ కన్వీనర్ గా వ్యవహరించిన డాక్టర్ పడాల తిరుపతిని తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం (టి.జి. సి.జి.టి.ఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, కరీంనగర్ జిల్లా టీజీసీజీటీఏ అధ్యక్షులు డాక్టర్ మామిడిపల్లి సత్యప్రకాష్, కార్యదర్శి డాక్టర్ గోపు శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఆర్.ఆర్ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ తిరుక్కోవేల శ్రీనివాస్, పరీక్షల అదనపు నియంత్రణ అధికారి డాక్టర్ తాంద్ర కరుణాకర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎడేళ్ల నారాయణ తదితర అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉచిత ఆన్లైన్ కోచింగ్ కన్వీనర్ డాక్టర్ పడాల తిరుపతి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం (టి.జి.సి.జి.టి.ఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి సూచన, సలహాల వల్లనే ఈ అత్యుత్తమ ర్యాంకులు సాధ్యమయ్యాయి అని, గత ఆరు సంవత్సరాలుగా టి.జి.సి.జి.టి.ఏ బ్యానర్ పైన ప్రాథమిక సభ్యులు, వృక్షశాస్త్ర అధ్యాపకులు తో పాటు ఇతర అధ్యాపకులు, ఆర్.బి.వి.ఆర్.ఆర్ మహిళా కళాశాల



హైదరాబాద్ వారి సౌజన్యంతో నిరంతరాయంగా ఈ కార్యక్రమాలు నిర్వహించామని, ఈ ఉచిత ఆన్లైన్ కోచింగ్ కార్యక్రమాలు మారుమూల గ్రామాలలో చదివే విద్యార్థులతో పాటు, వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, గురుకుల కళాశాలలు, అటానమస్ కళాశాలలు తో పాటు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ ఉచిత ఆన్లైన్ కోచింగ్ ద్వారా గైడెన్స్ పొంది, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించామని దీనికి టీజీ సీజీటీఏ తోడ్పాటుకు, ఇతర అధ్యాపకులకు, రిసోర్స్ పర్సన్స్ కి ధన్యవాదాలు తెలియజేశారు. తదనంతరం టి.జి.సి.జి.టి.ఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కడారు సురేందర్ రెడ్డిని ఉచిత ఆన్లైన్ కోచింగ్ కన్వీనర్ డాక్టర్ పడాల తిరుపతి, కరీంనగర్ జిల్లా టీజీసీజీటీఏ అధ్యక్షులు డాక్టర్ మామిడిపల్లి సత్య ప్రకాష్, కార్యదర్శి డాక్టర్ గోపు శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఆర్.ఆర్ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ తిరుక్కోవేల శ్రీనివాస్, పరీక్షల అదనపు నియంత్రణ అధికారి డాక్టర్ తాంద్ర కరుణాకర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎడేళ్ల నారాయణ సన్మానించారు.

# వర్షాలకోసం దావన్ పల్లిలో శ్రీరామ హృదయ కలశ యాత్ర...

### జాతీయస్థాయి అవార్డు గ్రహీత చెరుకు మహేశ్వర శర్మకు సర్పంచ్, గ్రామస్థుల ఘనసన్మానం భగవద్గీత ప్రదానం...

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 10

శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా దావన్ పల్లిలో వికాస తరంగిణి, జాతీయవాది జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ బానావత్ తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో శ్రీరామ హృదయ కలశ యాత్ర-- శ్రీరామ పాదయాత్ర ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకు మహేశ్వర శర్మ, వికాస తరంగిణి బాధ్యులు చిలుకమర్రి శ్యామసుందరాచారి శ్రీరామ కలశం, చిన్నజీయర్ స్వామివారి చిత్రపటాన్ని సర్పంచ్ ప్రసాద్, ఉపసర్పంచ్ రవి నాయక్, శ్రీహనుమాన్ దీక్ష గురుస్వామి జగన్‌లకు అందజేశారు. గ్రామపంచాయతీ నుంచి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వరకు జై శ్రీరామ్ నినాదాలతో పాదయాత్ర నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యుల చేతుల మీదుగా జాతీయ తెలుగు సారస్వత పరిషత్ వారి జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభా పురస్కారం అందుకున్న చెరుకు మహేశ్వర శర్మను సర్పంచ్ ప్రసాద్, గ్రామస్థులు, వికాస తరంగిణి బాధ్యులు, పండిత పరిషత్ జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ ఘనంగా సన్మానించి భగవద్గీతను అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దేశంలో సమృద్ధిగా



వర్షాలు కురవాలని, లోకకల్యాణం, ధర్మస్థాపన, ధర్మపాలకుల రక్షణ జరగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంతోష్ బలరాం రాజు నాయక్ గంగరాజం కౌమురయ్య, అంజనేయ స్వామి భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# హున్మకొండ లో ఘనంగా సగర విద్యార్థుల ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం

### హాజరైన స్థానిక ఎమ్మెల్యే, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు



మన వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

హనుమకొండ ఉమ్మడి జిల్లా సగర (ఉప్పర) సంక్షేమ సంఘ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఆదివారం ట్రస్ట్ భవనంలో నిర్వహించిన ప్రతిభా పురస్కార ప్రధానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హన్మకొండ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, విశిష్ట అతిథిగా తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర హాజరై విద్యలో ప్రతిభ కనబరిచిన సగర విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. ట్రస్ట్



అధ్యక్షులు సీత కమలాకర్ సగర గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సగర సంఘం అధ్యక్షులు నలుబోల సతీష్ సగర, రాష్ట్ర కోశాధికారి, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వడ్లకొండ కుమారస్వామి సగర, వేములవాడ రాజరాజేశ్వర సగర అన్నదాన సత్రం అధ్యక్షులు తాడిశెట్టి విద్యాసాగర్, ట్రస్టు గౌరవ సలహాదారులు తైలం వేణుగోపాల స్వామి సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి అయోధ్య సగర, కోశాధికారి రఘు సగర, జిల్లా యువజన సంఘం అధ్యక్షులుకోడిపాక గణేష్ సగర, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు చంద్రమౌళి సగర, తొర్రూరు మున్సిపల్ వైస్ ఛైర్పర్సన్ సోమ రజిని రాజశేఖర్ సగర, మాజీ కార్పొరేటర్ లు వీరగంటి రవీందర్ సగర, గుంటి శ్రీనివాస్ సగర, మాజీ రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి సగర, సగర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీనివాస్ రెడ్డి- మమత రెడ్డిల వివాహ వార్షికోత్సవం- అనాధ ఆశ్రమంలో అల్పాహారం

### శ్రీనివాస్ రెడ్డి- మమత దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన- సమితి సభ్యులు, చిన్నారులు



మన వార్తా మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో లండన్ నివాసులు కె శ్రీనివాస్ రెడ్డి- మమతా రెడ్డిల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అనాధ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అల్పాహార వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, అనాధ ఆశ్రమ పాఠశాలలో శ్రీనివాస్ రెడ్డి



మమతల కు కేక్ కట్ చేయించి పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు అనాధ పాఠశాల విద్యార్థులు, కృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు కృష్ణ గోపాల్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ ఇలాంటి శుభ సందర్భాలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా పేద, అనాధ, వృద్ధుల కడుపు నింపి వారి ముఖాల్లో చిరునవ్వులు చూడాలని తెలిపారు.

## భక్తితో అమ్మవారిని దర్శించుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్.

### - రాఘవేందర్ రెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 10 వార్త మిర్రర్ ప్రతినిధి:-మాడుగుల మండలం దొడ్లపహాడ్ గ్రామంలో నూతనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తయిన వీరనాగమ్మ దేవత ఆలయంలో 41 రోజుల పూజా కార్యక్రమాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన మండల పూజా కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్- సీ ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించిన రాఘవేందర్ రెడ్డి, ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారంగా రూ.1,80,000 అందించారు. ఈ మొత్తంతో ఆలయ పెయింటింగ్ పనులు పూర్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని ఆలయాలు ప్రజల విశ్వాసాలు, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఆలయాల



అభివృద్ధి ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా, గ్రామ ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐక్యతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. వీరనాగమ్మ దేవత ఆశీస్సులు దొడ్లపహాడ్ గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఆలయ అభివృద్ధికి రూ.1.80 లక్షల సహకారం అందించిన రాఘవేందర్ రెడ్డికి ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మట్ట నాగయ్య, మట్ట యాదయ్య, అర్జున్, మల్లేష్, శ్రీను, శంకర్, రాజు, నాగరాజు, వెంకటేష్, సురేష్, సత్తయ్య, యాదగిరి, నాగేష్‌తో పాటు గ్రామ పెద్దలు, భక్తులు,గ్రామస్థులు పాల్గొన్నారు.



## వేములవాడ శ్రీ రాజరాజేశ్వరాలయం సేవలో రాయికల్ వాసులు.

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 10జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణము నకు చెందిన మహిళా సేవకులు, రాయికల్ మండలంలోని మహితాపూర్ గ్రామానికి చెందిన మహిళా సేవకులు, జగిత్యాల పట్టణంలోని మహిళా సేవకులు శ్రీ వల్లి సేవ సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వరాలయం లో సోమవారం రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు కొంతమంది భీమ్మన్న ఆలయంలో మరికొందరు బద్ధి పోచమ్మ దేవాలయం వద్ద భక్తుల రద్దీ ని బట్టి వారికి క్యూ లైన్ యందు సక్రమంగా నిలకడగా ఉండే విదంగా వారికి లైన్ లో ఉన్నవారికి దాహార్తిని తీర్చడానికి త్రాగు నీటిని సరఫరా చేశారు. మరి కొంతమంది భీమ్మన్న గుడి యందు లైన్ లో సక్రమంగా నిలకడగా ఉండే విధంగా అక్కడకు వచ్చిన వారందరికీ దర్శన భాగ్యం కల్పించారు. సేవా కు వెళ్లిన వారందరికీ శ్రీ రాజ రాజేశ్వరాలయం వారు శ్రీ వల్లి సేవా సంస్థ ఆధ్వర్యంలో వారికి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయికల్, మహితాపూర్ గ్రామాని కి చెందిన బేతి రాధ, పెద్దిరెడ్డి రాజేశ్వరి, అనుమల్ల విజయ, మార్గం లక్ష్మి, ఎనుగంధుల విజయ, ఎనుగందుల జయ, మొగిలపేట లక్ష్మి, మాధురి, జల, లక్ష్మి, రాధ ఎనగందుల కళా తదితరులు పాల్గొన్నారు.



# 12వ వేజ్బోర్డ్ కమిటీ ఏర్పాటు చేయాలి

### -జాతీయ కార్మిక సంఘాల నాయకులు

వార్త మిర్రర్ మందమర్రి ఆగస్ట్10: కేంద్రం లోని నరేంద్రమోడి ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్లతో కార్మికవర్గానికి తీవ్ర నష్టం వాటిల్లు తుందని లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని జాతీయ కార్మికసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 4 లేబర్ కోడ్ లు రద్దుచేసి 12వ వేజ్ బోర్డ్ ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తు జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన సింగరేణి వ్యాప్త ఆందోళన కార్యక్రమాల్లో బాగంగా సోమవారం ఏరియా జిఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, జిఎం రాదాకృష్ణకు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతు బొగ్గుగని కార్మికులకు 12వ వేతన కమిటీని ఏర్పాటు చేసి వేజ్ బోర్డ్ చర్చలను వెంటనే ప్రారంబించాలన్నారు. దేశంలో రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల దరలకనుగుణంగా కార్మికుల వేతనాలు, అలవెన్సులు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక పరిస్తితుల ప్రభావంతో కార్మికులపై పెరుగుతున్న ఆర్థిక బారాన్ని దృష్టిలో పెట్టుకొని బొగ్గుగని కార్మికులకు మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత, హక్కులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు శైలేంద్ర సత్యనారాయణ, ఎండి అక్బర్అలీ, దాగం మల్లేష్, ఐఎన్టియుసి నాయకులు కాంపెల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, రాంశెట్టి నరేందర్, సిఐటియు నాయకులు భూపాల్, అల్లి రాజేందర్, సాంబారు వెంకటస్వామి, హెచ్ఎంఎస్ నాయకులు పార్వతి రాజిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు.




# యోగాతో శతాయుష్షు సాధ్యం

### -సింగరేణి ఏరియా జిఎం రాదాకృష్ణ

వార్త మిర్రర్ మందమర్రి ఆగస్ట్10:

యోగాతో శతాయుష్షు సాధ్యమని పదవి విరమణ పొందిన సింగరేణి కార్మికులకు ఆరోగ్యమే అసలైన సంపద అపని సింగరేణి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో మూడు నెలల ఉచిత యోగా శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని, ప్రతిఒక్కరు యోగాను నిత్య జీవితంలో బాగంగా చేసుకోవడం ద్వార ఆరోగ్యంగా ఆనందంగా జీవించవచ్చన్నారు. మూడు నెలల యోగా శిక్షణలో పదవి విరమణ పొందిన ఉద్యోగులు అద్భుత ప్రదర్శనలు ఇచ్చారని వారిలో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయన్నారు. పదవి విరమణ అనంతరం ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. యోగాసనాలతో పొందిన జ్ఞానాన్ని తమవరకే పరిమితం చేయకుండా తోటి వారికి అందించాలని కోరారు. యోగా మాస్టర్లు కొంపెల్లి రమేష్, ముల్కల్ల శంకర్, బర్ల సదానందంలు మాట్లాడుతు మన ఋషులు ప్రపంచానికి అందించిన అపారమైన యోగా విజ్ఞానం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని వయసుతో సంబందం లేకుండా ప్రతిఒక్కరు నిపుణుల సూచనలతో యోగా సాదన చేయడం ద్వార ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కార్మిక సంఘం అధ్యక్షులు వాసాల శంకర్, టిబిజికెఎస్ నాయకులు ఓ రాజశేఖర్, సూర్య నమస్కారాల రికార్డ్ గ్రహీత బిఆర్ఎస్ నాయకులు మద్ది శంకర్, గవర్నర్ అవార్డ్ గ్రహీత వెంకటేశ్, ఆయూశ్ యోగా టీచర్ శైలజ, సాంబమూర్తి, సీనియర్ యోగా సభ్యులు, మహిళలు పాల్గోన్నారు.

# ప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే భరోసా



కల్వకుర్తి, ఆగస్టు 10 వార్త మిర్రర్ ప్రతినిధి:-

జెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నెమలిగుట్ట తండాకు చెందిన కెలావత్ శ్రీను నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆసుపత్రికి వెళ్లి కెలావత్ శ్రీనును పరామర్శించారు. వైద్యులను కలిసి శ్రీను ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం శ్రీను కుటుంబ సభ్యులను కలిసి ధైర్యంగా ఉండాలని, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జెపల్లి గ్రామ సర్పంచ్ అమినా అశోక్ రాథోడ్, డిప్యూటీ సర్పంచ్ మధు, నెమలిగుట్ట తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.



# గేమ్‌ఛేంజర్ వచ్చేది అప్పుడే?



రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్' విషయంలో కొత్త అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందా? అని ఆశగా ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది నిజంగా చల్లని వార్తే. వచ్చే ఏడాది సమ్మర్‌లోపు ఈ చిత్రం షూటింగ్‌ను ముగించనున్నట్టు సమాచారం. దాదాపు 90శాతం ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. ఇదిలావుంటే.. శంకర్ దర్శకత్వంలోనే కమల్‌హాసన్ నటిస్తున్న 'భారతీయుడు 2' కూడా పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. దీన్నిబట్టి ఒక రెండునెలలు అటుఇటుగా రెండు సినిమాలూ విడుదలయ్యే అవకాశం ఉందని సినీవర్గాల సమాచారం. ఇక రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్' సినిమా విషయానికొస్తే, సమకాలీన రాజకీయాలను ప్రశ్నిస్తూ, వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ శంకర్ తెరకెక్కిస్తున్న విప్లవాత్మక చిత్రంగా 'గేమ్‌ఛేంజర్'ని చెప్పొచ్చు. ఇందులో రామ్‌చరణ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కైరా అద్వానీ, అంజలీ కథానాయికలు. ఇంకా శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## మహిషాసురుడి కథ

# కరావళి

కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటించిన తాజా చిత్రం 'కరావళి'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో గురుదత్త గనిగ తెరకెక్కించారు. త్వరలో విడుదలకానుంది. సోమవారం ఫస్ట్‌లుక్ ప్రోమోను విడుదల చేశారు. ఓ వైపు గేదె ప్రసవం, మరోవైపు హీరో జననం..ఈ రెండింటికి ఏదో సంబంధం ఉన్నట్లు చూపించడం..చివరకు హీరో మహిషాసురుడిగా మారినట్లు చూపించడం ఉత్కంఠను పంచింది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'కరావళి అనే గ్రామంలో జరిగే కథ ఇది. మన భాష, సంస్కృతి మూలాల్లోంచి కథను తీసుకున్నాం. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అభిమన్యు సదానందన్, సంగీతం: సచిన్ బస్రూర్.



# పద్దెనిమిదేళ్ల విరామం తర్వాత

త్రిష అందంగా ఉంటుంది. తెరపై ఆమె యాటిట్యూడ్ మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా ఉంటుంది. ఆ నవ్వు విప్పారిన పొద్దుతిరుగుడుపువ్వులా ఉంటుంది. మొన్నామధ్య వచ్చిన మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్'లో చాలామంది హీరోయిన్లున్నా, అందంలో అందరికంటే ఒకమార్కు ఎక్కువ త్రిషకే పడిందని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అందుకే.. నేటికీ పెద్దపెద్ద సినిమాలు ఈ అందాన్నే వరిస్తున్నాయి. ఇటీవలే తమిళ విజయ్‌కి జోడీగా ఆమె నటించిన 'లియో' సినిమా విడుదలై మంచి వసూళ్లే రాబట్టింది. త్వరలో మరో భారీ సినిమాలో నటించనుంది త్రిష. అది కూడా తెలుగు సినిమా. అందునా మెగాస్టార్ సినిమా. అవును.. చిరంజీవి హీరోగా మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'లో త్రిష ప్రధాన కథానాయికగా ఎంపికైంది. అనుష్క, నయనతార, ఐశ్వర్యరాయ్ ఇలా చాలామంది హీరోయిన్ల పేర్లు ఈ పాత్ర విషయంలో వినిపించాయి. చివరకు త్రిష ఖరారైంది. 18ఏళ్ల క్రితం చిరంజీవితో 'స్టాలిన్' సినిమాలో నటించింది త్రిష. మళ్లీ ఇన్నాళ్లకు మెగాస్టార్‌తో జతకట్టనుంది. మెగా అభిమానులకు ఇది నిజంగా శుభవార్తే.



# బాలీవుడ్‌లో సత్తా చూపిస్తా

అగ్ర కథానాయిక కీర్తి సురేష్ ఏ పాత్రలోనైనా చక్కగా ఒదిగిపోతుంది. వాణిజ్య చిత్రాలతో పాటు మహిళా ప్రధాన కథాంశాల్లో కూడా తనదైన నటనతో మెప్పిస్తుంది. ఈ ఏడాది విడుదలైన 'దసరా' చిత్రంలో వెన్నెలగా అద్భుతాభినయంతో మెప్పించింది. తాజాగా ఈ భామ బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తూ నటిస్తున్న వెబ్ సిరీస్ 'అక్క'. పీరియాడిక్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కనున్న ఈ సిరీస్‌ను బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. ధర్మరాజ్ శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్‌లో రాధికా ఆప్టేతో కలిసి నటించనుంది కీర్తి సురేష్. త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రస్తుతం ఈ సిరీస్ తాలూకు రిహార్సల్స్ ముంబయిలో జరుగుతున్నాయి. సోమవారం ముంబయిలో అడుగుపెట్టిన కీర్తి సురేష్ తన తొలి బాలీవుడ్ వెబ్ సిరీస్ గురించి ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పింది. బాలీవుడ్‌లో తన ప్రయాణం ఈ సిరీస్‌తో మొదలుకావడం ఆనందంగా ఉందని, తాను పోషించిన పాత్ర కూడా పూర్తి కొత్తదనంతో ఉంటుందని కీర్తి సురేష్ పేర్కొంది. నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. కీర్తి సురేష్ ప్రస్తుతం తమిళంలో సైరన్, రఘుతాథ, రివాల్వర్ రాణి, కన్నివేడి వంటి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

## వైమానిక వీరుని కథ

వైమానిక వీరుల పరాక్రమాలను, విధి నిర్వహణలో వారు ఎదుర్కొన్న సవాళ్లను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆపరేషన్ వాలైంటైన్'. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిస్తున్న ఈ చిత్రానికి శక్తిప్రతాప్ సింగ్ దర్శకుడు. మానుషి చిల్లార్ కథానాయిక. సందీప్ ముద్దా నిర్మాత. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 16న విడుదల చేయబోతున్నారు. త్వరలో టీజర్ రిలీజ్ కానుంది. దర్శకుడు మాట్లాడుతూ ' ఈ సినిమాలో వరుణ్‌తేజ్ ఎయిర్ పైలట్‌గా కనిపిస్తాడు. రాడార్ ఆఫీసర్ పాత్రలో కథానాయిక మానుషి చిల్లార్ నటిస్తున్నది. ఎయిర్‌ఫోర్స్ నేపథ్యంలో వస్తున్న తొలి తెలుగు చిత్రమిది. దేశం ఎదుర్కొన్న అతిపెద్ద వైమానిక దాడుల నేపథ్యంలో యదార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను తెరకెక్కించాం. దేశభక్తి ప్రధానంగా ఆకట్టుకుంటుంది. 'మేజర్' వంటి విజయం తర్వాత సోనీ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంటుందనే నమ్మకం ఉంది' అని చిత్రబృందం పేర్కొంది.

